సాక్షి
మెదక్
ఆదివారం । 22 । జనవరి । 2023

న్యూస్‌రీల్

దివ్యాంగులు 'మీ సేవ'లో దరఖాస్తు చేసుకోవాలి

మెదక్ కలెక్టరేట్: సదరం ధ్రువపత్రం అందజేయడానికి జనవరి 2023 మాసానికి సంబంధించి శారీరక, మానసిక దివ్యాంగులకు తేదీలను మీ సేవ,ఈ సేవ కేంద్రాలకు కేటాయించామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజరయ్యే దివ్యాంగులు తమ సమీపంలోని మీ సేవ లేదా ఈ సేవ కేంద్రంలో ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. రసీదుతో కేటాయించబడిన రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపు జిల్లా ఆస్పత్రిలో హాజరు కావా లని సూచించారు. వచ్చేటప్పుడు తప్పనిసరిగా మీ సేవ రసీదు, ఫొటో, ఆధార్ జిరాక్స్, సంబంధిత మెడికల్ రిపోర్ట్స్ తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు కాని వారు సదరం క్యాంపునకు హాజరు కావొద్దని విజ్ఞప్తి చేశారు.

ఓపికతో పరీక్షలు చేయండి



వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న వెంకట్ శైలేష్

నర్సాపూర్ రూరల్: ఓపికతో ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేయాలని జెడ్పీ సీఈఓ వెంకట్ శైలేష్ వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం నర్సాపూర్ మండలం గొల్లపల్లిలో కొనసాగుతున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరికరాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. పరీక్షల కోసం వచ్చే వారితో శిబిరం సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయిని కృష్ణ, ఎంపీడీఓ మార్టిన్ లూథర్, ఎంపీఓ వైద్య శ్రీనివాస్, మండల వైద్యాధికారి రఘు వరుణ్, ఉప సర్పంచ్ గణేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



యూనిఫామ్ అందిస్తున్న డీఈఓ రమేశ్

చేగుంట(తూప్రాన్): చేగుంటలోని స్పోర్ట్స్ పాఠశాలను జిల్లా విద్యాధికారి రమేశ్ శనివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు బోర్డుపై రాయించారు. అనంతరం విద్యార్థినులకు యూనిఫామ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ, వైస్ ప్రిన్సిపాల్ మంజుల, పాఠశాల, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నన్ను విస్మరిస్తారా..?

జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతపై జెడ్పీటీసీ ఆగ్రహం



తూప్రాన్: ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించకుండా ఒక ప్రజా ప్రతినిధినైన తనను విస్మరించడం ఎంత వరకు సమంజసం అని జెడ్పీటీసీ బస్వాన్నగారి రాణిసత్యనారాయణగౌడ్ జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచిస్తే జెడ్పీ చైర్ పర్సన్ మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తూప్రాన్ మండలంలోని అల్లాపూర్, ఘనపూర్ గ్రామాల్లో బోరుబావుల మంజూరు కార్యక్రమంలో తనను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఇలాంటివి సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ విషయాన్ని మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

27, 28 తేదీల్లో లోన్ ఐడెంటిఫికేషన్ క్యాంపు

మెదక్ మున్సిపాలిటీ: ఈనెల 27, 28 తేదీల్లో మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని మైనార్టీలకు లోన్ ఐడెంటిఫికేషన్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జానకీరాంసాగర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్ సబ్సిడీలోన్‌లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మెదక్ మున్సిపాలిటీలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27వ తేదీన ఎస్‌బీఐ రామాలయం, ఎస్‌బీఐ జేఎన్‌రోడ్డు, ఎస్‌బీఐ(ఏడీబీ), ఇండియన్‌బ్యాంకు దరఖాస్తుదారులకు, ఈనెల 28న ఏపీజీవీబీ, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, కరూర్ వైశ్య బ్యాంకు, ఇండస్ ఇండ్ బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకు లబ్ధిదారులకు ఐడెంటిఫికేషన్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మంజీరాకు మాఘ కళ



మాఘ స్నానాలు చేస్తున్న భక్తులు



- ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్న లక్ష మంది భక్తులు
- సింగూర్ నీటి విడుదలతో పొంగిపొర్లిన ఘనపురం
- ఏర్పాట్లు పర్యవేక్షించిన ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

పాపన్నపేట (మెదక్) : ఏడుపాయల ఆలయం వద్ద పుణ్యస్నానాలతో భక్తులు పరవశించిపోయారు. శనివారం మాఘస్నానాల కోసం సుమారు లక్ష మంది భక్తులు తరలివచ్చి, మంజీరాపాయల్లో స్నానాలు చేసి వనదుర్గమ్మను దర్శించుకున్నారు. సింగూర్ నుంచి నీరు విడుదల చేయడంతో ఘనపురం ఆనకట్ట పొంగిపొర్లింది. ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ సార శ్రీనివాస్, ధర్మకర్తలు, వివిధ శాఖల సిబ్బంది జాతరలో సేవలందించారు.

- పుణ్యనది మంజీరమ్మకు మాఘ కళ వచ్చింది. సింగూర్ నుంచి విడుదల చేసిన 0.35 టీఎంసీల నీరు శనివారం ఏడుపాయల చేరుకోగా ఘనపురం ఆనకట్ట నిండుకుంది. దీంతో అమ్మవారి ఆలయం ఎదుట నుంచి మంజీరా పరుగులు తీసింది.
- నక్క వాగు వద్ద కలుషిత నీరు చేరడంతో, ఘనపురం ప్రాజెక్ట్ ద్వారా వచ్చిన నీరంతా పచ్చగానే ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో భక్తులు ముక్కు మూసుకొని మంజీరా నీటిలో మునకలు వేశారు.
- శనివారం తెల్లవారుజాము నుంచే, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్నానం చేసి దుర్గమ్మ దర్శనం కోసం బారులు తీరారు.
- అమ్మవారిని రంగు రంగుల పూలతో అందంగా అలంకరించారు. పురోహితులు శంకర శర్మ, పార్థివ శర్మ దుర్గమ్మకు పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పుణ్యస్నానాలతో పులకించిన భక్తజనం



భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ తల్లి

- రాజగోపురం నుంచి వనదుర్గ ఆలయం వరకు భక్తులు కిక్కిరిసిపోయారు. బోనాలు తీసి, ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లలు లేని దంపతులు సంతానం కోసం గుండంలో స్నానాలు చేశారు.
- ఆలయ ఎదుట మంజీరా నదిలో, ఘనపురం ఆనకట్ట దిగువ భాగంలో ఏర్పాటు చేసిన షవర్ల కింద కొందరు స్నానాలు ఆచరించారు.

వనమెల్లా జనమే..

- మాఘ స్నానాలకు సుమారు లక్ష మంది భక్తులు తరలిరావడంతో ఏడుపాయల వనమంతా జనారణ్యంగా మారింది. కొల్చారం వైపు టేకుల గడ్డ భక్తులతో కిటకిటలాడింది.
- నాగ్సాన్‌పల్లి వైపు భక్తుల సంఖ్య తక్కువగా కనిపించింది. కిలో మీటర్ దూరంలోని వాహనాలను పార్కింగ్ చేయడంతో, జాతరలో ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడలేదు.
- ఆర్టీసీ ప్రతీ 15 నిమిషాలకు ఒక బస్సు నడిపింది. భక్తులు ఆరోగ్యం కోసం హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. మంజీరా నీటిలో ప్రమాదాలు జరగకుండా, నిరంతరం గజ ఈతగాళ్ల పహారా కాశారు.
- నాలుగు చోట్ల స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ఉచిత భోజన వసతి కల్పించారు. ఇరిగేషన్ అధికారులు ఘనపురం ఆనకట్టపై ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు.
- జాతరలో తాగునీటికి ఇబ్బంది ఏర్పడింది. ఎస్పీ రోహిణీప్రియదర్శిని ఏడుపాయల జాతరలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. డీఎస్పీ సైదులు, నలుగురు సీఐలు, 20 మంది ఎస్సైలు, 200 మంది పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విధులు నిర్వహించారు.



సంతాన గుండంలో స్నానాలు చేస్తున్న దంపతులు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ రోహిణీప్రియదర్శిని



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి

ప్రకృతిని విస్మరిస్తే మనుగడ ఉండదు

సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ శోభ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రకృతి వ్యవసాయం చేసి భూమిని కాపాడాలని, వ్యవసాయానికి అధిక మోతాదులో రసాయనాల వినియోగించి ప్రకృతిని విస్మరిస్తే భవిష్యత్‌లో మనుగడ ఉండదని సీనియర్ సైంటిస్ట్ నత్నాయిపల్లి డాక్టర్ శోభ అన్నారు. శనివారం చిలప్‌చెడ్ మండలం చండూర్ గ్రామశివారులో రైతు నారాయణరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో గ్రామ భారతి ఆధ్వర్యంలో, మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి సమక్షంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ భారతి పూర్వ అధ్యక్షుడు మురహరి రావు, గ్రామ భారతి రాష్ట్ర కార్యదర్శి సామ ఎల్లారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ భారతి అనేది రైతులను చైతన్యం చేసే స్వచ్ఛంద సంస్థ అన్నారు. గ్రామ భారతి గుడి, బడి, రైతు మడి, సరుకుల అంగడి, అమ్మ ఒడి అనే అంశాల పై ప్రత్యేక దృష్టి పెడుతుందన్నారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవి మాట్లాడుతూ.. నేల ఆరోగ్యంగా ఉంటేనే మొక్క ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు బాల్‌రెడ్డి, భూపాల్, కృష్ణవేణి, జిల్లా రైతు సమన్వయ సభ్యుడు సయ్యద్ హుస్సేన్, గ్రామ భారతి సభ్యులు కరుణ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, అద్వైత మామిడి రైతుల సంఘం చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, నాయకులు జగన్‌రెడ్డి, వీరాస్వామి, రైతులు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భాధారణతో మేలుజాతి దూడలు

జిల్లా పశు వైద్యాధికారి విజయశేఖర్‌రెడ్డి



దూడకు చికిత్స చేస్తున్న విజయశేఖర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): కృత్రిమ గర్భాధారణతో మేలు జాతి దూడలు పొందవచ్చని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ విజయశేఖర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కోనాపూర్‌లో ఎంపీపీ భిక్షపతితో కలిసి ఆయన శనివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా పశువైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, కృత్రిమ గర్భాధారణతో మేలు జాతి దూడలు జన్మించడంతోపాటు పాల దిగుబడి పెరుగుతుందని పేర్కొన్నారు. సరైన సమయంలో పశువుల ఎదను గుర్తించి గర్భాధారణ చేయడం మంచిదని విజయశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా శిబిరాలను రైతులు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాస్, సుధాకర్, వెటర్నరీ అసిస్టెంట్ రాజు, గోపాలమిత్ర సంతోష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ఇమ్మానియేల్, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటతో పాటు నార్సింగి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. చేగుంటలో బాలాజీకాలనీ, అంబేడ్కర్ కాలనీల్లో నిర్మించే పల్లె దవాఖనలకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి భూమిపూజ నిర్వహించారు. నార్సింగి మండలం భీంరావుపల్లి గ్రామంలో కంటివెలుగు క్యాంపును ప్రారంభించారు. వల్లూర్ గ్రామంలో పర్యటించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జాతీయరహదారిపై బస్టాండ్ నిర్మాణం, ఐమాట్స్ లైట్లను ఏర్పాటు చేస్తానని మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన సమావేశంలో హామీ ఇచ్చారు. పలువురికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు సబిత, శ్రీనివాస్, జెడ్పీటీసీలు ముదాం శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, అశోక్, సర్పంచ్‌లు మహేశ్వరీ, ఎల్లమ్మ, అశోక్, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

మూడు రోజుల్లో 9,545 మందికి పరీక్షలు

- 1,642 మందికి రీడింగ్ కళ్లద్దాలు
- కలెక్టర్ హరీశ్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో మూడు రోజుల్లో 9,545 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 1,642 మందికి రీడింగ్ కళ్లద్దాలను అందజేసినట్లు కలెక్టర్ హరీశ్ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేత మహంతి, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి కంటి వెలుగు నిర్వహణపై ఆయా జిల్లా కలెక్టర్లలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మేడ్చల్ నుంచి కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ.. జిల్లాలో 3 రోజుల్లో 9,545 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 1,642 మందికి రీడింగ్ కళ్లద్దాలను అందించామని తెలిపారు. మరో 2891 ప్రిస్క్రైబడ్ కళ్లద్దాలను ఆర్డర్ చేశామన్నారు. డాటా ఎంట్రీలో సమస్యలు ఉత్పన్నం కాకుండా సిబ్బందికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. జనాభా ప్రాతిపదికన రీడింగ్ అద్దాలు వెంట తీసుకెళ్లాలని సూచించామన్నారు. పంచాయతీ సెక్రెటరీ, సర్పంచ్‌లు, మండల అధికారుల ద్వారా కంటి వెలుగుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సమావేశంలో మెదక్ నుంచి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చందు నాయక్, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరీశ్

నేడే మల్లన్న పట్నం వారం

- అందంగా ముస్తాబైన ఆలయ పరిసరాలు
- మూడు నెలల పాటు సాగనున్న జాతర
- తోట బావివద్ద అగ్ని గుండాలు
- పెద్ద పట్నానికి భారీగా ఏర్పాట్లు



దోలు చప్పుళ్లతో వస్తున్న భక్తజనం



విద్యుత్ కాంతులలో స్వామి వారి ఆలయం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న జాతర నేటి(ఆదివారం) పట్నం వారంతో మొదలై మూడు నెలల పాటు కానసాగనుంది. ఈ ఏడాది తొమ్మిది వారాల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. మొదటి పట్నం వారానికి మల్లన్న క్షేత్రం అందంగా ముస్తాబైంది. తోటబావి వద్ద సోమవారం పెద్ద పట్నం, అగ్నిగుండాలు నిర్వహించే స్థలంలో భారీ ఇనుప గేట్లు ఏర్పాటు చేశారు. అగ్నిగుండాలు భక్తులు చూడడానికి, దాటడానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు నాలుగు రకాల దర్శనాలను ఏర్పాటు చేశారు. ధర్మదర్శనం, రూ.100తో శీఘ్ర దర్శనం, రూ.150తో విశిష్ట, రూ.500 వీవీఐపీ దర్శనాలకు ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు.

భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు

కొమురవెల్లిలోని సినిమా టాకీస్, బస్టాండ్, పెద్దమ్మ ఆలయం, రాంసాగర్ రోడ్డులోని కురుమ సత్రం వరకు, చేర్యాల రోడ్డులోని బస్టాండ్ దాటి వై జంక్షన్ స్వాగత తోరణం వరకు భక్తులకు అవసరమైన పార్కింగ్, తాగునీరు తదితర వసుతులను ఏర్పాటు చేశారు. ఈ జాతరకు సుమారు 50 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. ఆలయ ప్రాంగణంలోనికి వాహనాలు రాకుండా పోలీస్ అధికారులు ఆంక్షలు విధించారు. రోడ్డుపై స్టాపర్స్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక పార్కింగ్ స్థలాకు చేరుకునేందుకు చర్యలు చేపట్టారు.

శనివారం ధూళి దర్శనం

పట్నం వారానికి భక్తులు శనివారం నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆయానికి చేరుకున్న భక్తులు కాళ్లు, చేతులు కడుగకుండా ధూళి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆదివారం స్నానమాచరించి పట్నం, బోనంతో స్వామికి మొక్కులు చెల్లించుకుంటారు. సోమవారం సాయంత్రం వరకు మొక్కులు చెల్లించుకుని మంగళవారం ఉదయం వరకు కొండపోచమ్మ ఆలయానికి చేరుకుంటారు.

బస్సు మార్గాలు

- హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ నుంచి భక్తులు రావడానికి ఆర్టీసీ అధికారులు స్పెషల్ బస్సులను ఏర్పాటు చేశారు.
- హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులకు జేబీఎస్ నుంచి స్పెషల్ బస్సులు అందుబాటులో ఉన్నాయి.
- సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, మెట్‌పల్లి, బస్సుల్లో వచ్చి కొమురవెల్లి పాత కమాన్ వద్ద దిగి ఆటోల ద్వారా ఆలయానికి చేరుకోవచ్చు.



అగ్నిగుండాలకు ఏర్పాట్లు

పార్కింగ్ ఇలా..

- సిద్దిపేట నుంచి పాత కమాన్ మీదుగా వచ్చే వాహనాలకు.. కరీంనగర్, జగిత్యాల, మెట్‌పల్లి నుంచి వచ్చే భక్తులకు మల్లన్న చెరువు వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- జనగామ, వరంగల్, నల్లగొండ నుంచి వచ్చే భక్తులు బస్టాండ్ సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం అడిషనల్ డీసీపీ మహేందర్ పార్కింగ్ ప్రదేశాలను, పోలీసుల బందోబస్తును పరిశీలించారు.

జేబీఎస్ నుంచి ప్రత్యేక బస్సులు

సిద్దిపేటకమాన్: జూబ్లీ బస్టాండ్(జేబీఎస్) నుంచి కొమురవెల్లి దేవస్థానానికి, కొమురవెల్లి నుంచి జేబీఎస్‌కు ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రతీ అర గంటకు ఆర్టీసీ బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కొమురవెల్లి గేట్ నుంచి ఆలయం వరకు, కొమురవెల్లి నుంచి కొండపోచమ్మ ఆలయం వద్దకు ప్రత్యేక షటిల్ బస్సులు 22వ తేదీ వరకు నడుపనున్నట్లు డీఎం తెలిపారు. ప్రయాణికులు, భక్తులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

వినాయక మార్ట్ తనిఖీ



సరుకుల ధరలను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో ఇటీవల ప్రారంభించిన వినాయకమార్ట్‌ను శనివారం జిల్లా తూనికల కొలతల అధికారి శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు. మార్టులోని సరుకులను పరిశీలించి, వాటి ధరల వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. మార్టులో నిర్ణీత ఎమ్మార్పీ ధరకన్నా ఎక్కువకు అమ్ముతున్నట్లు ఫిర్యాదు అందినట్లు చెప్పారు. విచారణ చేయగా తేడా వచ్చిన డబ్బును వినియోగదారుడికి తిరిగి ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారన్నారు. మార్టులో తూకానికి వినియోగిస్తున్న కాంటాలను సర్టిఫై చేయించుకోవాలని సూచించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి జిల్లా అవార్డు

చిన్నకోదూరు(సిద్దిపేట): సిద్దిపేటలో జరిగిన జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాలో మండల పరిధిలోని రామునిపట్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సువర్ణదేవి ఫన్ గేమ్ రూపొందించారు. దీని ద్వారా అక్షరాలను గుర్తిస్తూ పదాలను తయారు చేసే విధానాన్ని వివరించారు. జిల్లా స్థాయిలో సువర్ణాదేవికి ద్వితీయ బహుమతి సాధించారు. ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆమెను అభినందించారు.

నిధులు కేటాయించాలి

గజ్వేల్‌రూరల్: దళితుల సమగ్ర అభివృద్ధి, సంక్షేమం, రక్షణకు బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని డీబీఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. దళితుల జనాభా ప్రకారం బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని కోరుతూ శనివారం రాష్ట్ర మంత్రి హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో దళితుల జనాభా 20 శాతం పెరిగినందున బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు మైస రాములు మాదిగ, డీబీఎఫ్ నాయకులు వేణు తదితరులు పాల్గొన్నారు.

రైతుపై అడవి పంది దాడి

మెదక్ రూరల్: అడవి పంది దాడిలో రైతు గాయపడ్డాడు. ఈ సంఘటన హవేళీఘణాపూర్ మండలం జక్కన్నపేటలో శనివారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బయ్యా సాయికుమార్ తన పొలంలో నడుస్తుండగా అకస్మాత్తుగా అడవి పంది దాడి చేసింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి రైతులు అతడిని వెంటనే మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశాడు.

ప్రైవేట్ అద్దె గదుల దోపిడీ

కొమురవెల్లి జాతరలో ఇష్టారాజ్యంగా వసూలు

- దేవాలయ ఆధ్వర్యంలో 70 గదులు మాత్రమే
- ప్రైవేట్ గదులను ఆశ్రయిస్తున్న భక్తులు
- గదికి ఒక్క రోజుకు రూ.4 వేల నుంచి రూ.10 వేల డిమాండ్
- పట్టించుకోని పోలీసులు, రెవెన్యూ అధికారులు



కొమురవెల్లి జాతరకు వస్తున్న భక్తులు

సాక్షి, సిద్దిపేట: కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకునే భక్తులకు వసతి ఇబ్బందులు తప్పడం లేదు. కొమురవెల్లి జాతరలో భక్తుల తాకిడికి సరిపడా దేవాలయ గదులు లేకపోవడంతో ప్రైవేట్ అద్దెగదులను ఆశ్రయిస్తున్నారు. జనవరి నుంచి మార్చి వరకు ఆది, బుధవారం భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీంతో ప్రైవేట్ అద్దె గదుల నిర్వాహకులు భక్తులను దోచుకుంటున్నారు. సామాన్య భక్తులు అంత చెల్లించలేక చెట్ల కిందనే ఉంటూ నానా అవస్థలు పడుతున్నారు.

రోజుకు రూ 4 వేల నుంచి 10 వేలు

గది విస్తీర్ణాన్ని బట్టి భక్తుల నుంచి కిరాయి వసూలుచేస్తున్నారు. గదికి ఒక రోజుకు రూ.4 వేల నుంచి రూ10 వేల వరకు వసూలు చేస్తున్నారని భక్తులు చెబుతున్నారు. డిమాండ్ ఉంటే మరింత ఎక్కువ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

- ప్రైవేట్ గదుల నిర్వాహకులు ఏజెంట్‌లను ఏర్పాటు చేసుకొని అద్దెకు ఇస్తున్నారు. దేవాలయ పార్కింగ్ స్థలాలకు ఏదైన కారు వస్తే వారు వాలిపోతారు. మా దగ్గర అన్ని సౌకర్యాలతో గదులు ఉన్నాయి, మా దగ్గర ఉన్నాయంటూ ఏజెంట్‌లు భక్తుల చుట్టు తిరుగుతుంటారు. దేవస్థానం గదులు లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ గదులు అద్దెకు తీసుకుంటున్నారు.
- కొందరు భక్తులు చెట్ల కిందనే బోనం వండి, పట్నం వేసి మల్లన్నకు మొక్కులు చెల్లిస్తున్నారు. దేవాలయ ప్రాంగణంలో వసతి కోసం కాటేజీలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- భక్తుల సహకారంతో 140 కాటేజీలను నిర్మించారు. అందులో 25 పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. 40 గదులు దేవాలయ అవసరాలకు వినియోగిస్తున్నారు. దీంతో 75 గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఆ గదులు తొలి ప్రాధాన్యత దాతలకు ఇస్తున్నారు.
- కొమురవెల్లిలో 50 కాటేజీలు కొత్తగా నిర్మిస్తున్నారు. నాలుగేళ్లుగా పనులు సాగుతూనే ఉన్నాయి. పంచాయతీ రాజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో సంబంధింత కాంట్రాక్టర్ నత్తనడకన పనులు చేస్తున్నాడు. ఇప్పటికైనా దేవాలయ అధికారులు, రెవెన్యూ, పోలీసులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని ప్రైవేట్ గదుల అద్దెలను నియంత్రించాలని, మరిన్ని కాటేజీలు ప్రభుత్వం నిర్మించే విధంగా ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

రోజుకు రూ.6 వేలు చెల్లించా



మేము గత 25 సంవత్సరాలుగా స్వామివారిని దర్శించుకుంటున్నాం. ఏటా పట్నం వారం సందర్భంగా ఇక్కడికి వచ్చి బోనం, పట్నం వేసి బస చేస్తాం. కానీ ఈసారి ప్రైవేట్ వసతి గదుల కిరాయి బాగా పెరిగింది. మేము ఈసారి రూ.6 వేలు చెల్లించాం. మేము ఆ గదిని రెండు నెలల క్రితమే బుక్ చేసుకున్నాం.

– సురేశ్, భక్తుడు హైదరాబాద్

ప్రైవేట్ వసతి గదుల నిర్వాహకులపై నియంత్రణ లేదు



ప్రైవేటు వసతి గదుల నిర్వాహకులపై దేవదాయ శాఖ ఎలాంటి నియంత్రణ విధించ లేదు. రాష్ట్ర పండగలలో మాత్రం వారిపై రెవెన్యూ శాఖ చర్యలు తీసుకోవచ్చు. దేవాలయం ఆధ్వర్యంలో కొత్తగా గదులు నిర్మిస్తున్నాం.

– బాలాజీ ,ఆలయ ఈవో

డైజోఫాం తయారీదారుల అరెస్ట్

- ముగ్గురి రిమాండ్, మరో నిందితుడు పరారీ
- 600 గ్రాముల డైజోఫాం, 1.9 కేజీల వ్యర్థాలు స్వాధీనం
- కారు, బైక్, నాలుగు సెల్ ఫోన్లు, తయారీ యంత్రాలు సీజ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణు గోపాల్ రెడ్డి

పటాన్‌చెరుటౌన్: డైజోఫాం, ఐల్ప్రాజోలం తయారీ కేసులో ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శనివారం పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పటాన్‌చెరు సీఐ వేణు గోపాల్ రెడ్డి,క్రైం సీఐ బీసన్న వివరాలు వెల్లడించారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామ శివారులో ఈనెల 20వ తేదీన కెఎస్ఎం జనరిక్ ఫార్మాసిటికల్స్ లిమిటెడ్ కంపెనీ పక్కన ల్యాబ్‌లో ముగ్గురు వ్యక్తులు ఏదో పౌడర్‌ను తయారు చేస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్ఐ రామానాయుడు సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా తిరుపతికి చెందిన మదన్ మోహన్ రెడ్డి, ఇతడు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో డిప్లమా ఇన్ కెమికల్ ఇంజనీరింగ్ పట్టభద్రుడు, రెండో వ్యక్తి గుంటూరుకు చెందిన గురువారెడ్డి ప్రస్తుతం కామారెడ్డిలో నివాసం ఉంటున్నాడు, మూడో వ్యక్తి దుబ్బాక మండలం ధర్మాజీపేటకు చెందిన మనోహర్‌గౌడ్‌గా గుర్తించారు. గత ఏడాది జూలైలో డైజోఫాం రవాణా కేసులో సిద్దిపేట రూరల్ పోలీసులు నాగిరెడ్డి, రమణారావు, గురువారెడ్డి, వెంకట్రామిరెడ్డి, సురేశ్‌లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత డైజోఫాం తయారీకి ల్యాబ్ కోసం గూగుల్ లో శోధించారు. పాశమైలారం పారిశ్రామికవాడ చూపిందని, దీంతో వీరు ల్యాబ్ నిర్వాహకులతో మాట్లాడుకొని రోజుకు రూ.7 వేలు అద్దె చెల్లిస్తున్నారు. ఇందులో డైజోఫాం, ఐల్ప్రాజోలం తయారు చేస్తున్నారు. 600 గ్రాముల డైజోఫాం, 1.9 కేజీల తయారీ వ్యర్థ పదార్థంతో పాటు కారు, బైక్, నాలుగు సెల్ ఫోన్లు, తయారీ యంత్రాలు, కెమికల్స్‌ను సీజ్ చేసి వారిని రిమాండ్ కు తరలించారు. పరారీలో ఉన్న నరేందర్‌రెడ్డిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ వేణు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మూతపడిన పరిశ్రమలపై నిఘా పెట్టామని, పరిశ్రమ యాజమానులు, స్థానికులు అపరిచితులు ఎవరైన అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

భూ నిర్వాసితులకు బెదిరింపులు సరికాదు



గుడాటిపల్లిలో భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న రిటైర్ సీఐ భూమయ్య

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టులో ముంపునకు గురికాని భూములకు సైతం పరిహారం ఇచ్చారని, వాటిపై పోలీసులు విచారణ చేపట్టాలని విశ్రాంత సీఐ దాసరి భూమయ్య అన్నారు. శనివారం అక్కన్నపేట మండలం ముంపు గ్రామం గుడాటిపల్లిలో భూ నిర్వాసితుల దీక్షా శిబిరాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. రెండు రోజులుగా గిరిజన భూ నిర్వాసితులకు బీఆర్ఎస్ నాయకుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కూడా వెళ్లనీయకుండా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పెళ్లయిన ఆడబిడ్డలు నెలరోజులుగా ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. 200 మంది గిరిజన కుటుంబాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పెళ్లయిన యువతులకు పరిహారం ఇచ్చేందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం రాజిరెడ్డి,భూనిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాములు మృతదేహం

బెజ్జంకి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌కు చెందిన కూన రాములు(57) కూలి పనులు చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి కూలి పనులు చేసి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇసుక లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. లారీ డ్రైవర్ మోహన్ అజాగ్రత్తగా వాహనాన్ని నడపడం వల్లే రాములు మృతిచెందినట్టు భార్య లక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ



మాట్లాడుతున్న సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాల్య వివాహాలను అరికట్టాలని సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ అన్నారు. శనివారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో మహిళల రక్షణ చట్టాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, ఉమెన్ షీ టీమ్ ప్రాముఖ్యత, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అజిత్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆర్గనైజర్ రాము, స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ శివకుమారి, ఇన్‌స్పెక్టర్ దుర్గ మాట్లాడారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా బాల బాలికలు, మహిళల రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పోక్సో, బాల్య వివాహాల చట్టాల గురించి వివరించారు. సమస్యలపై 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 8333998699, షీ టీమ్ వాట్సప్ నంబర్ 7901640473, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498 ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శారద, స్నేహిత సపోర్ట్ సెంటర్ కోఆర్డినేటర్లు వసంత, సిద్దిపేట షీ టీమ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇద్దరు ఆత్మహత్య

తొగుట(దుబ్బాక): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. తొగుట ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముచ్చర్ల మల్లేశం (55) గత కొన్నేళ్లుగా పెట్రోల్ పంపు నిర్వహిస్తున్నాడు. పెట్రోల్ పంపు నిర్వాహణకు రూ.20 లక్షలు అప్పు చేశాడు. అవి తీర్చే మార్గం లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. శుక్రవారం మల్లన్న సాగర్ కట్ట సమీపంలో పురుగుల మందు తాగి భార్య మల్లవ్వ, కూతురు మానసకు ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. వెంటనే వారు ఇరుగు పొరుగువారితో కలిసి వెళ్లి చూడగా మల్లేశం అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం మరణించారు. మృతుడి భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

కల్హేర్(నారాయణఖేడ్): మద్యానికి బానిసై, జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కల్హేర్ ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ శనివారం వివరాలు తెలిపారు. మండలంలోని బీబీపేటకు చెందిన వడ్డె సాయిలు(35) వివాహం ఎనిమిదేళ్ల క్రితం కామారెడ్డి జిల్లా జగన్నాథ్‌పల్లికు చెందిన అంజలితో జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. రెండేళ్ల క్రితం భార్య అంజలి పుట్టింటికి వెళ్లింది. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ చేసినా రాజీ కుదరలేదు. పిట్లంలో కూలీ పనులు చేసుకుంటూ సాయిలు మద్యానికి అలవాటు పడ్డాడు. మద్యనికి బానిసగా మారడం, భార్య పుట్టింటికి వెళ్లడంతో గ్రామ శివారులో వేప చెట్టుకు ఉరేసుకున్నాడు.

బండరాయి మీదపడి..

పటాన్‌చెరుటౌన్: బండరాయి మీద పడటంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసులు రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వెంకటాపూర్ బీమ్లా తండాకు చెందిన హరిచంద్ (46) కుటుంబ సభ్యులతో కలసి బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి అమీన్‌పూర్ పెద్దచెరువు కింది భాగంలో భవన నిర్మాణ వ్యర్థాలను లారీల్లో తీసుకొని వచ్చి పారబోస్తున్నారు. అందులో ఉన్న ఇనుప ముక్కలు తీసుకునేందుకు హరిచంద్ అక్కడికి వెళ్లాడు. వాటిని తీస్తున్న క్రమంలో మట్టిని పారతో తొలగిస్తుండగా పెద్దబండరాయి అతనిపై దొర్లి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బండరాయిని తొలగించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ట్రాలీ టైరు కిందపడి బాలుడు..

సదాశివపేటరూరల్ (సంగారెడ్డి): ప్రమాదవశాత్తుగా ట్రాక్టర్ చక్రాల కింద పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోనా పూర్ గ్రామానికి చెందిన అసద్(2) ఉదయం ఇంటి వద్ద ఆడుకుంటున్నాడు. అలా ఆడుకుంటూ చెత్త సేకరణకు వచ్చి ట్రాక్టర్ ట్రాలీ వైపు వెళ్లాడు. అది గమనించకుండా ట్రాక్టర్ డ్రైవర్ ముందుకు వెళ్లడంతో ట్రాలీ టైరు కిందపడి బాలుడు మృతి చెందాడు. బాలుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సదాశివపేట సీఐ నవీన్ కుమార్ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులోపడి యువకుడి మృతి



రోదిస్తున్న నవీన్ కుటుంబ సభ్యులు

హత్నూర(సంగారెడ్డి): ప్రమాదవశాత్తు చెరువులోపడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధి ముచ్చర్ల గ్రామంలో శనివారం మధ్యాహ్నం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన సంపంగి నవీన్ (23) వారం క్రితం భార్యా పిల్లలతో కలిసి ముచ్చర్ల గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చారు. శనివారం మధ్యాహ్నం బావమరిది వడ్డే శేఖర్‌తో కలిసి గ్రామ శివారులోని పెద్ద చెరువులో స్నానం చేసేందుకు దిగారు. నవీన్ నీటిలో మునిగిపోతుండగా శేఖర్ గమనించి రక్షించే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకొని చెరువులో గాలించగా సుమారు 2 గంటల తర్వాత మృతదేహాన్ని బయటకు తీశారు. సంఘటన స్థలాన్ని హత్నూర పోలీసులు సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఏడాది బాబు ఉన్నారు.

రోదించిన కుటుంబ సభ్యులు

తూప్రాన్: రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం యువకుడి మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలోని గుండ్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డెర భాగ్యమ్మ రాములు ద్వితీయ కుమారుడు నవీన్(23) సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన అనంతలక్ష్మితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. కాగా శుక్రవారం అత్తగారి ఇంటికి వెళ్లిన నవీన్ తన బావమరిది శేఖర్‌తో కలిసి గ్రామ సమీప చెరువులో స్నానం చేసేందుకు వెళ్లి శవమై తేలాడు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కమిటీ గ్రామ అధ్యక్షుడు మనే కృష్ణ, రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

గుండెపోటుతో యువకుడి మృతి



కరుణాకర్ (ఫైల్)

తొగుట(దుబ్బాక): గుండెపోటుతో ఓ యువకుడు మరణించాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత కుటుంబీకుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రామోళ్ల కరుణాకర్ (26) ఉపాధి కోసం హైదరాబాద్‌కు ఆరునెలల క్రితం వలసవెళ్లాడు. అక్కడ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా డ్యూటీకి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో ఛాతీలో నొప్పిగా ఉందంటూ భార్యకు తెలిపాడు. దీంతో చికిత్స కోసం సమీపంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోయి కుటుంబం సభ్యులు అనాథలుగా మిగిలారు. ఉపాధి కోసం వెళ్లి శవమైరావడంతో కుటుంబం సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ కొండల్‌రెడ్డి, ఎంపీటీసీ లలిత రమేశ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ..

బెజ్జంకి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌కు చెందిన కూన రాములు(57) కూలి పనులు చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి కూలి పనులు చేసి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇసుక లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. లారీ డ్రైవర్ మోహన్ అజాగ్రత్తగా వాహనాన్ని నడపడం వల్లే రాములు మృతిచెందినట్టు భార్య లక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నలుగురి అదృశ్యం

పోలీసు స్టేషన్ పరిధిలో నలుగురు అదృశ్యమయ్యారు. వారిలో ఒక విద్యార్థి, వివాహిత, ఇద్దరు యువకులు ఉన్నారు. అక్రమ సంబంధ ఉందని భార్య కేసు పెట్టడంతో పోలీసులు భర్తకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో స్నేహితులు పిలుస్తున్నారని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. కోడలు, అత్తింటివారిపై తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరో చోట విహార యాత్రకు వెళ్తున్నానని ఇంటిలో చెప్పి వెళ్లిన విద్యార్థి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఇంకోచోట జీతం డబ్బు ఇంటిలో ఇవ్వక పోదంతో తండ్రి మందలించాలని కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భార్యాభర్తలు తగవుపడటంతో భార్య పుట్టింటికి వెళ్లింది. అక్కడ ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్నేహితులు పిలుస్తున్నారని వెళ్లి...



రవి (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: స్నేహితులు పిలుస్తున్నారని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణంలోని జెపీ కాలనీకి చెందిన నాగామణి కుమారుడు రవి(24)కి జోగిపేటకు చెందిన రేణుకను ఇచ్చి వివాహం చేశారు. రవికి అక్రమ సంబంధం ఉందని రేణుక జోగిపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు రవికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో 19వ తేదీ ఉదయం ఇద్దరు వ్యక్తులు వచ్చి రవిని బయటకు రమ్మని పిలిచారు. స్నేహితులు పిలుస్తున్నారని ఇంటిలో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుమారుడి కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. తన కొడుకు అదృశ్యంపై కోడలు రేణుక, ఆమె తల్లి నాగమణి, లోకేష్‌పై అనుమానం ఉందని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎగ్జిబిషన్‌కు వెళ్తున్నానని ..

విహార యాత్రకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నాడు. ఈనెల 10వ తేదీన విహారయాత్ర కోసం బాసర వెళ్తున్నామని రూ.2 వేలు తీసుకొని వెళ్లాడు. టూర్‌కు వెళ్లిన విద్యార్థులు 11వ తేదీన సాయంత్రం వచ్చారు. అతడు మాత్రం ఫోన్ చేస్తే విజయవాడలో ఉన్నానని తెలిపాడు. మళ్లీ ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుమారుడి కోసం తెలిసిని అడిగినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జీతం డబ్బులు ఇవ్వడం లేదని..



హరీశ్ (ఫైల్)

జీతం ఇంట్లో ఇవ్వడం లేదని తండ్రి మందలించడంతో కుమారుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పరిధిలోని నర్రగూడెంకు చెందిన కాంతయ్య కుమారుడు హరీశ్(24) ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే జీతం ఇంట్లో ఇవ్వకపోవడంతో ఈనెల 5వ తేదీన తండ్రి మందలించాడు. దీంతో హరీశ్ అలిగి సర్టిఫికెట్లు తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. కోపంతో వెళ్లిన కుమారుడు తిరిగి వస్తాడని కుటుంబ సభ్యులు ఎదురు చూశారు. తిరిగి రాకపోవడంతో అమీన్‌పూర్ పోలీసు స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బయటకు వెళ్లి వస్తానని చెప్పి..



స్వాతి (ఫైల్)

బయటకు వెళ్లి వస్తాన్ని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ వివాహిత అదృశ్యంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన స్వాతికి సంగారెడ్డికి చెందిన రాంరెడ్డి తో వివాహం జరిగింది. 19వ తేదీన స్వాతి తన భర్త తో గొడవపడి రుద్రారంలో ఉండే కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు ఇంటికి రమ్మని చెప్పడంతో 20వ తేదీన రుద్రారం గ్రామానికి వచ్చింది. కుటుంబ సభ్యులు స్వాతికి నచ్చజెప్పారు. అదేరోజు మధ్యాహ్నం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. స్వాతి సోదరుడు సతీశ్ ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.